సాక్షి
వైఎస్సార్ జిల్లా
శనివారం | 1 | మార్చి | 2025

బడా మోసం



కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రజలను మోసం చేసే విధంగా ఉంది. ఎన్నికల హామీలను గాలికొదిలేశారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, దీపం పథకాలకు నిధుల కోత పెట్టారు. జిల్లాలో ఏ పరిశ్రమకు గానీ నిధులు కేటాయించలేదు. - పి.రవీంద్రనాథ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ

డ్వాక్రా మహిళలకు టోకరా



రాయలసీమలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ కార్యాలయాలన్నింటినీ అమరావతికి తరలిస్తున్న ప్రభుత్వం.. ఇక్కడికి ఏ ఒక్క ప్రాజెక్టును తీసుకురాలేకపోయింది. డ్వాక్రా మహిళలకు పది లక్షల వరకూ సున్నా వడ్డీకే రుణాలిస్తామని చెప్పి మోసం చేశారు. -ఎస్‌బీ అంజద్‌బాషా, మాజీ ఉప ముఖ్యమంత్రి

గరిష్టం/కనిష్టం
34.0/19.3

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 19.3 - 34.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి

కడప అర్బన్: పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం పోలీసు 'గ్రీవియన్స్‌డే' నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్‌లు, ఆయా విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది బదిలీలు, వ్యక్తిగత, స్పౌస్, చిల్డ్రన్స్ మెడికల్ సమస్యల గురించి ఎస్పీకి విన్నవించుకున్నారు. వారి నుంచి ఆయన వినతిపత్రాలు స్వీకరించారు.

సైన్స్‌తోనే సమాజ, దేశాభివృద్ధి

కడప ఎడ్యుకేషన్: సైన్స్‌తోనే సమాజ, దేశాభివృద్ధి సాధ్యమని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ షంషుద్దీన్ అన్నారు. శుక్రవారం జాతీయ సైన్సు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి(ఆప్ కాస్టు) ఆధ్వర్యంలో కడప మున్సిపల్ హైస్కూల్ (మెయిన్)లో సైన్సు ఎగ్జిబిషన్ నిర్వహించి విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ మ్యూజియం క్యూరేటర్ రెహమాన్, ఆప్‌కాస్టు జిల్లా కో ఆర్డినేటర్ శ్రీనివాసులరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు నాగమణి పాల్గొన్నారు.

గాంధీనగర్ హైస్కూల్‌లో..

కడపలోని గాంధీనగర్ హైస్కూల్‌లో వికసిత్ భారత్ కోసం సైన్స్, ఆవిష్కరణలో ప్రపంచ నాయకత్వం- భారతీయ యువతకు సాధకారత అనే అంశంపై స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్, సమగ్రశిక్ష సంయుక్తంగా జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డీఈఓ డాక్టర్ షంషుద్దీన్, డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఒంటిమిట్ట సాక్షి విలేకరిపై దాడి

సాక్షి, టాస్క్‌ఫోర్స్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఒంటిమిట్ట కోదండ రామస్వామి ఆలయంలో జీర్ణోద్ధరణ అభివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో ఫొటోలు తీసేందుకు వెళ్లిన ఒంటిమిట్ట మండల సాక్షి రిపోర్టర్ వెంకటకృష్ణపై పురావస్తు శాఖ కాంట్రాక్టర్ కృష్ణమూర్తి దాడికి పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆలయ జీర్ణోద్ధరణ పనుల ఫొటోలు తీసేందుకు వెంకటకృష్ణ వెళ్లగా అడ్డుకున్న పురావస్తు శాఖ కాంట్రాక్టర్ కృష్ణమూర్తి ఎలా ఫొటోలను చిత్రీకరిస్తున్నావ్ అంటూ బెదిరించడమే కాక దుర్భాషలాడారు. అలానే విలేకరిని చొక్కా పట్టుకొని బయటికి గెంటివేశాడు. విషయం తెలుసుకున్న పాత్రికేయులు సంఘటనపై ఫిర్యాదు చేసేందుకు పోలీసు స్టేషన్‌కు చేరుకోగా ఒంటిమిట్ట సీఐ బాబు విలేకరులను అరగంటకు పైగా నిరీక్షింపజేశారు. ఓపిక నశించిన పాత్రికేయుల బృందం సీఐ చాంబర్‌కు వెళ్లి ఘటనను వివరించినా స్పందన లేదని పాత్రికేయులు వాపోయారు. అంతకుముందు ఎస్ఐ శివప్రసాద్‌కు పాత్రికేయుల బృందం ఫిర్యాదు చేసింది.

దాడి తగదు

కడప కోటిరెడ్డిసర్కిల్: సాక్షి దినపత్రిక ఒంటిమిట్ట కంట్రిబ్యూటర్‌గా పని చేస్తున్న వెంకటకృష్ణపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి రామసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎం.బాలకృష్ణారెడ్డి, శ్రీనివాసులు తెలిపారు. దాడి చేసిన వ్యక్తిపై తక్షణమే చట్టపరమైన చర్యలు చేపట్టి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని వారు కోరారు.

- సీమ సమగ్రాభివృద్ధి ఉత్తి మాటే..!
- ఊసే లేని ఉక్కు పరిశ్రమ
- వైఎస్సార్–ఈఎంసీకి లభించని చోటు
- అన్నమయ్య ప్రాజెక్టు ప్రస్తావన లేదు
- కడప, అన్నమయ్య జిల్లాలకు లోపించిన ప్రాధాన్యం
- రాష్ట్ర బడ్జెట్‌లో కూటమి సర్కార్‌ది సవతి తల్లి ప్రేమ
- పెదవి విరుస్తున్న ఆర్థిక రంగ నిపుణులు, రాజకీయ పక్షాలు

అదే వంచన

సాక్షి ప్రతినిధి, కడప: తెలుగుదేశం పార్టీ నాయకత్వంలోని కూటమి సర్కారు రాయలసీమ సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ప్రకటించడం ఉత్తి మాటేనని తేటతెల్లమైంది. బడ్జెట్‌లో ఉక్కు పరిశ్రమ ఊసే లేదు. వైఎస్సార్ ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చర్ క్లస్టర్ ప్రస్తావన లేదు. అన్నమయ్య ప్రాజెక్టు పునఃనిర్మాణంపై దృష్టి లేదు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తొలిసారి ప్రవేశ పెట్టిన పూర్తి స్థాయి బడ్జెట్‌లో అరకొర నిధులు కేటాయించారు. జనాభా ప్రాతిపదికన లేదా భూ విస్తీర్ణం ప్రాతిపదికన ఎటు చూసినా రాయలసీమ ప్రాంతానికి అన్యాయం చేశారని ఆర్థిక నిపుణులు వాపోతున్నారు. సాగునీటి రంగ ప్రాజెక్టులకు సైతం సరైన న్యాయం లభించలేదని రాజకీయ పక్షాలు నినదిస్తున్నాయి.

అంకెల గారడి


2025–26 వార్షిక బడ్జెట్‌లో చంద్రబాబు సర్కారు పరనిందా–ఆత్మస్తుతి మినహా ప్రాధాన్యత లోపించందని నిపుణులు వివరిస్తున్నారు. రూ.3,22,359 కోట్ల బడ్జెట్ అంకెల గారడిని తలపిస్తోందని రాజకీయ నేతలు భావిస్తున్నారు. దాదాపు రూ.80 వేల కోట్ల లోటు బడ్జెట్‌ను ఎలా పూడుస్తారో, ఆదాయ మార్గాలు ఏమిటో తెలియజేయలేదని పలువురు వివరిస్తున్నారు. ఉద్యోగులకు వేల కోట్ల బకాయిలున్నా.. చెల్లింపులకు నిధులు కేటాయించలేదని ఉద్యోగ వర్గాలు వాపోతున్నాయి. డీఏ, పీఆర్సీ పెండింగ్‌లో ఉన్నాయని, ఏపీజీఎల్ఐ మెచ్యూరిటీ క్లెయిమ్స్, డెత్ క్లెయిమ్స్, పీఎఫ్ చెల్లింపులకు కేటాయింపులు లేవని ఉద్యోగులు మండిపడుతున్నారు. కూటమి సర్కారు ఎన్నికల హామీ 12వ పీఆర్సీ కమిషన్ నియామకం, మధ్యంతర భృతి కోసం ఎదురుచూస్తున్న ఉపాధ్యాయులకు శరాఘాతంగా రాష్ట్ర బడ్జెట్ నిలుస్తున్నట్లు పలువురు వాపోతున్నారు.



జిల్లాలో ఉక్కు పరిశ్రమకోసం ఏర్పాటు చేసిన శిలాఫలకం (ఫైల్)

బడ్జెట్‌లో కేటాయింపులు

ప్రాజెక్టు పేరు	నిధులు (రూ.కోట్లలో)
కేసీ కెనాల్	183.88
తెలుగుగంగ	345.48
గాలేరి–నగరి	488.56
పీబీసీ	170.68
లోయర్ సగిలేరు	20
ఎస్సార్‌బీసీ	5.52



ప్రాజెక్టులకు అరకొర నిధులే

చంద్రబాబు సర్కారు 2025–26 వార్షిక బడ్జెట్‌లో గాలేరి–నగరి సుజల స్రవంతి పథకం పట్ల శీతకన్ను వేశారు. జీఎన్ఎస్ఎస్–హెచ్ఎన్ఎస్ఎస్ అనుసంధానం చేసి కుప్పంకు సైతం నీరు ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ సర్కారు భావిస్తే, కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ఇప్పటికే జీఎన్ఎస్ఎస్ దాదాపు రూ.2 వేల కోట్ల పనులు పూర్తి అయి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. తాజాగా రూ.488.56 కోట్లు మాత్రమే కేటాయింపు చేశారు. అంటే దాదాపు రూ.15 వందల కోట్ల బిల్లులు పెండింగ్ పడనున్నాయి. ఇక జీఎన్ఎస్ఎస్ పరిధిలో పనులు ఏమాత్రం ముందడుగు పడే అవకాశమే లేదని నిపుణులు వివరిస్తున్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ రూ.3,243.59 కోట్లు కేటాయించగా, అందులో 15 శాతం మాత్రమే జీఎన్ఎస్ఎస్ కేటాయించడం వెనుక కూటమి సర్కారు దుర్బుద్ధి తేటతెల్లమౌతోందని రాజకీయ పక్షాలు ఆరోపిస్తున్నాయి. జీఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువ పనుల పురోగతి ప్రశ్నార్థకంగా మారిందని పలువురు వాపోతున్నారు. గతంలో గండికోట ప్రాజెక్టు నాన్ ప్రియారిటీ జాబితాలో చేర్చి ఘనత వహించిన అప్పటి చంద్రబాబు సర్కారు.. మరోమారు జీఎన్ఎస్ఎస్ పట్ల అదే ధోరణి ప్రదర్శిస్తున్నారని పలువురు వాపోతున్నారు. మరోవైపు అన్నమయ్య ప్రాజెక్టు పునఃనిర్మాణం ఊసే లేదు. బడ్జెట్‌లో ఆ ప్రాజెక్టుకు నిధుల కేటాయింపులే లేకపోవడం గమనార్హం.

మహిళలు, నిరుద్యోగులకు మొండిచేయి

సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన మహాశక్తి పథకం, నిరుద్యోగ భృతికి మంగళం పలికింది. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 చొప్పున అందిస్తామని ప్రకటించారు. ఆ హామీ మేరకు ఒక్క వైఎస్సార్ జిల్లాలోనే 7,06,94 మంది అర్హులుగా ఉన్నారు. ప్రతి నెలా రూ.106.05 కోట్లు చెల్లించాల్సి ఉంది. అలాగే నిరుద్యోగ భృతి రూ.3 వేలు అందిస్తామని ప్రకటించారు, ఆ పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా 2.80 లక్షల మందికి అందించాల్సి ఉంది. వీరికి ప్రతి నెలా రూ.84 కోట్లు చెల్లించాలి.





2025–26 వార్షిక బడ్జెట్‌లో ఆయా పథకాలకు నిధుల కేటాయింపు ఊసే లేకపోవడం గమనార్హం. అలాగే ధరల స్థిరీకరణ నిధి రూ.300 కోట్లు మాత్రమే కేటాయించి రైతులకు గిట్టుబాటు ధరల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధి లేమి స్పష్టంగా కన్పిస్తోందని పలువురు వెల్లడిస్తున్నారు.

హామీలపై దృష్టి పెట్టలేదు



గత బడ్జెట్‌లోనూ ఇలాగే మోసం చేశారు. ఈ సారి ప్రవేశ పెట్టిన పూర్తి స్థాయి బడ్జెట్‌లో అయినా హామీల అమలుకు నిధుల కేటాయింపులు చేస్తారని ప్రజలు ఆశగా ఎదురు చూశారు. అయితే వారికి నిరాశే ఎదురైంది. సూపర్ సిక్స్ హామీలు అమలు చేసే ఆలోచన ఈ ప్రభుత్వానికి ఉన్నట్లు కనిపించడం లేదు. - సురేష్ బాబు, మేయర్, కడప నగరం

వెనుకబడిన ప్రాంతాలపై ఏదీ శ్రద్ధ?



వెనుకబడిన ప్రాంతాల సాగు, తాగునీటి ప్రాజెక్టులపై బడ్జెట్ కేటాయింపుల్లో తీవ్ర అన్యాయం జరిగింది. బడ్జెట్‌లో పది శాతం ఆధారంగా 32,236 కోట్లు వెనుకబడిన ప్రాంతాల కోసం కేటాయించేందుకు సవరణలు చేపట్టాలి. - బి.నారాయణ, అధ్యక్షులు, ఏపీ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక

ఉక్కు పరిశ్రమ ఊసేలేదు



బడ్జెట్ కేటాయింపుల్లో కడప జిల్లా ప్రజల ఆకాంక్ష ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణానికి నిధులు కేటాయించకపోవడంతో తీరని అన్యాయం జరిగింది. రూ.3.2 లక్షల కోట్ల అంచనా వ్యయంతో ప్రవేశపెట్టిన బడ్జెట్లో కడప ఉక్కు ఫ్యాక్టరీ ఊసెత్తకపోవడం విచారకరం. -జి. చంద్ర, సీపీఐ జిల్లా కార్యదర్శి

పొగడ్తలతోనే సరి



బడ్జెట్లో గత ప్రభుత్వంపై పరనిందలు, చంద్రబాబు నాయుడుపై పొగడ్తలు మినహా ఏమీ లేవు. ఇంటి పన్నులు, విద్యుత్ పన్నులు, హరియర్స్ పేరుతో సామాన్య ప్రజలపై నూటికి, నూరు శాతం అదనంగా వేశారు, కానీ బడ్జెట్లో విద్యుత్ చార్జీలు, పన్నులు తగ్గిస్తున్నట్లు అబద్ధాలు చెప్పారు. -చంద్రశేఖర్, సీపీఎం జిల్లా కార్యదర్శి

నిరుద్యోగులకు కుచ్చుటోపీ



కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు కుచ్చుటోపీ పెట్టింది. ఏడాదికి 20 వేల ఉద్యోగాలు ఇస్తామని, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చింది. బడ్జెట్‌లో వీటికి నిధులు కేటాయించలేదు. -దేవిరెడ్డి ఆదిత్య, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ

సూపర్ సిక్స్‌కు తూట్లు



సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని ప్రజలను నమ్మించి టీడీపీ అధికారంలోకి వచ్చింది. ప్రజలు వారి మోసపు హామీలను నమ్మి అధికారాన్ని కట్టబెట్టారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో సూపర్ సిక్స్ హామీలకు తూట్లు పొడిచింది. - పీ నరేష్ రామాంజులురెడ్డి, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, వైఎస్ఆర్‌సీపీ

ఉద్యోగులకు రిక్తహస్తం



రాష్ట్ర బడ్జెట్‌లో ఉద్యోగులకు రిక్తహస్తం చూపించింది. ఏపీజీఎల్ఐ మెచ్యూరిటీ క్లెయిమ్స్‌కు నిధుల కేటాయింపు లేదు. అలాగే పీఎఫ్ లోన్ ఫ్లేస్‌మెంట్ ఫైనల్ పేమెంట్ చెల్లింపునకు కూడా నిధులు లేవు. 12వ పీఆర్‌సీ, మధ్యంతర భృతి, ఐఆర్ ప్రకటనపై దృష్టి పెట్టలేదు. దీంతో ఉద్యోగ, ఉపాధ్యాయులను నిరాశే మిగిలింది. - అమర్‌నాథ్‌రెడ్డి, వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

మధ్యతరగతి ప్రజలకు నిరాశ



రాష్ట్ర బడ్జెట్ పేద, మధ్య తరగతి ప్రజలకు పూర్తిగా నిరాశ కలిగించేదిగా ఉంది. రైతులు, కౌలు రైతులకు సరైన ప్రోత్సాహం లభించలేదు. పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించే దిశగా ఎలాంటి చర్యలు లేవు. నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణపై ప్రభుత్వం అసలు దృష్టి పెట్టలేదు. - ఎస్.డి.విజయ జ్యోతి, డీసీసీ అధ్యక్షురాలు

రాయలసీమకు అన్యాయం



కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో పెట్టిన మొదటి బడ్జెట్లో రాయలసీమకు అన్యాయం జరిగింది. జనాభా ప్రాతిపదికన గానీ, భూ విస్తీర్ణం ప్రాతిపదికన గానీ 42 శాతం రాష్ట్రంలో భాగంగా ఉన్న రాయలసీమకు కనీసం రూ.15 వేల కోట్ల నిధులు కేటాయించకపోవడం అన్యాయం. -ఎన్. రవిశంకర్‌రెడ్డి, ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి

ఎస్‌హెచ్‌జీల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో సహకార సంఘాలను బలోపేతం చేసి స్వయం సహాయక సంఘాల ఆర్థికాభివృద్ధికి సహకారం అందించాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ సహకార సంవత్సరం – 2025ను పురస్కరించుకుని చేపట్టాల్సిన కార్యక్రమాలకు ఉద్దేశించిన జిల్లా ప్రణాళికను ఆమోదించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి జె.సురేష్ కుమార్, డీఆర్డీఏ పీడీ ఆనంద్‌నాయక్, వ్యవసాయ శాఖ జేడీ నాగేశ్వరరావు, డీపీఓ రాజ్యలక్ష్మి, పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాసులురెడ్డి, డీసీసీబీ సీఈవో రాజామణి, మత్స్య శాఖ, నాబార్డు డీడీఎం, మార్క్‌ఫెడ్, మెప్మా తదితర శాఖల అధికారులు, బ్యాంక్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎగుమతి సామర్థ్యం పెంచేందుకు కృషి

జిల్లాలో పారిశ్రామిక, ఉద్యాన పంటల ఉత్పత్తుల ఎగుమతుల సామర్థ్యాన్ని పెంచేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమీక్ష నిర్వహించారు.



సహకార పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి

కడప సెవెన్‌రోడ్స్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అన్ని ప్రాధాన్యత అంశాలలో వైఎస్ఆర్ జిల్లాను అగ్రభాగంలో నిలపాలని కలెక్టర్ శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచిఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ, వేసవిలో తాగునీటి సమస్యలు, నీటి ద్వారా సంభవించే వ్యాధుల పట్ల ముందస్తు చర్యలు, సానుకూల ప్రజా అవగాహన, ఎంఎస్ఎంఈ సర్వే, నియోజకవర్గానికి ఒక ఎంఎస్ఎంఈ పార్కు, ఫీడర్ స్థాయి సోలరైజేషన్ పథకంకు భూమి కేటాయింపు.. తదితర అంశాలపై.. రాష్ట్ర పంచాయతీరాజ్ – గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్, రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్లా తదితరులతో కలిసి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కడప కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలు నుంచి జిల్లా కలెక్టర్ శ్రీధర్‌తోపాటు జేసీ ఆదితి సింగ్ పాల్గొన్నారు. సీఎస్ వీసీ ముగిసిన అనంతరం.. జిల్లాలోని అన్ని మున్సిపల్ అధికారులు, ఎంపీడీవోలతో జిల్లా కలెక్టర్ శ్రీధర్ వీసీ ద్వారా సమీక్షించారు.


- నేటి నుంచి ఇంటర్ పరీక్షలు
- ఏర్పాట్లు సర్వం సిద్ధం
- నిఘా నీడలో నిర్వహణ
- కేంద్రాల వద్ద బందోబస్తు

విజయీభవ

కడప ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. నేటి నుంచి ప్రారంభం కానున్న థియరీ పరీక్షలకు ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం ప్రథమ సంవత్సర విద్యార్థులకు పరీక్షలు మొదలు కానున్నాయి. ప్రతి రోజు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరగనున్నాయి. విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. 9 గంటలు దాటిన తరువాత ఒక్కరిని కూడా కేంద్రంలోకి అనుమతించబోమని ఇంటర్ అధికారులు స్పష్టం చేశారు. అలాగే పరీక్ష విధులకు హాజరయ్యే సిబ్బంది ఎవరు కూడా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్ తీసుకురాకూడదని ఇంటర్‌బోర్డు ఆదేశించింది. పరీక్షా కేంద్రంలో ఒక చీఫ్ సూపరింటెండెంట్ మాత్రమే సమాచారం తెలిపేందుకు బటన్ ఫోన్‌ను అనుమతించారు. అది కూడా సమాచారం పంపగానే పరీక్షా కేంద్రం ఆఫీసు రూములో పెట్టాల్సి ఉంటుంది.

కేంద్రాలకు చేరిన సామగ్రి

- పరీక్షలకు సంబంధించిన సామగ్రి పోలీసు పహారాలో స్ట్రోరేజ్ పాయింట్లకు చేరవేశారు. అలాగే పరీక్ష కేంద్రాలకు ఆన్సర్ బుక్‌లెట్స్, ఓఎంఆర్ సీట్లు, ఇతర సామగ్రి అధికారులు చేరవేశారు.
- పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌తోపాటు పోలీసు బందోబస్తు కల్పించనున్నారు. అలాగే మెడికల్ సిబ్బందితో ప్రాథమిక చికిత్స సేవలు అందుబాటులో ఉంచుతున్నారు.
- పరీక్షా కేంద్రాల్లో 950 సీసీ కెమెరాలతో నిఘా పెట్టారు. వాటిని ఇంటర్‌బోర్డు, జిల్లా ఆర్ఐఓ కార్యాలయానికి స్ట్రీమింగ్ ద్వారా అనుసంధానం చేశారు.
- బస్సు సౌకర్యం ఉన్న విద్యార్థులు తమ హాల్‌టికెట్‌ను చూపి ఉచితంగా బస్సు ప్రయాణం చేసేలా ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసింది. ఇందుకోసం ఆర్టీసీ పలు రూట్లకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతోంది.



జిల్లాలో ఇంటర్ పరీక్షా కేంద్రాలు:	64
ప్రథమ సంవత్సర విద్యార్థులు:	17114
ద్వితీయ సంవత్సర విద్యార్థులు:	15771
సమస్యాత్మక కేంద్రాలు:	13
చీఫ్‌లు, డిపార్ట్‌మెంట్ అధికారులు:	128
ఇన్విజిలేటర్లు:	700
ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు:	3
సిట్టింగ్ స్క్వాడ్:	10

- పరీక్షా కేంద్రాల పరిసరాల్లో ఎక్కడా జిరాక్స్ సెంటర్లు ఓపెన్‌లో లేకుండా మూసివేస్తారు. అలాగే పరీక్షా కేంద్రాలలో ఎక్కడ కూడా నేల బారు రాతలకు లేకుండా అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. దీంతోపాటు పరీక్షా కేంద్రాలలో నిరంతర విద్యుత్తు, ఫ్యాన్లు, లైటింట్, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించనున్నారు.
- సెల్‌ఫోన్లు, క్యాలిక్యులేటర్లు, బ్లూటూత్, డిజిటల్ వాచ్‌లు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించరు.

13 సమస్యాత్మక కేంద్రాలు గుర్తింపు

జిల్లాలో 13 పరీక్షా కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. సంబంధిత పరీక్షా కేంద్రాలలో సిట్టింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో గండిలోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల, దువ్వూరు, ముద్దనూరు, ఖాజీపేట, లింగాల, ఎర్రగుంట్ల, తొండూరు, సింహాద్రిపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలతోపాటు బి.మఠం ఏపీఎస్‌డబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల, కమలాపురం సోషల్ వెల్ఫేర్ స్కూల్స్, వేముల, చక్రాయపేట, కొండాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు.


టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు

పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు ఏవైనా సమస్యలంటే ఫిర్యాదు చేసేందుకు అనువుగా కడప ఆర్ఐవో కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఏవైనా సమస్యలుంటే ఈ కంట్రోల్ రూములో ఏర్పాటు చేసిన 08562–244171 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. తక్షణం సమస్యకు పరిష్కారం దొరుకుతుంది.

జిల్లాలో 64 పరీక్షా కేంద్రాలు

జిల్లాలో 64 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు 17114 మంది ఉన్నారు. వీరిలో జనరల్ 15781, ఒకేషనల్ 1333 మంది ఉన్నారు. ద్వితీయ సంవత్సర విద్యార్థులు 15771 మంది ఉన్నారు. వీరిలో ఒనరల్ 14598, ఒకేషనల్ 1182 మంది ఉన్నారు. మొత్తం 32885 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీటి నిర్వహణ కోసం 700 మంది ఇన్విజిలేటర్లను ఏర్పాటు చేశారు. 64 చీఫ్ సూపరింటెండెంట్లు, 64 మంది డిపార్ట్‌మెంట్ అధికారులతోపాటు 3 ఫ్లయింగ్ స్క్వాడ్, 10 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు పర్యవేక్షించనున్నారు.

పక్కాగా నిర్వహణ



జిల్లా వ్యాప్తంగా శనివారం నుంచి మొదలు కానున్న ఇంటర్ పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు చేశాం. ఎక్కడ కూడా నేలబారు పరీక్షలు లేకుండా అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశాం. ఇంటర్ పరీక్షలకు సంబంధించి సెల్ ఫోన్స్ ద్వారా వచ్చే వదంతులను తల్లిదండ్రులు ఎవరూ నమ్మవద్దు. - బండి వెంకటసుబ్బయ్య, ఆర్ఐవో, ఇంటర్ విద్య

